

# ముళ్ళగులాబి

"హలో రేఖా!" చిరునవ్వు అధరాలపై అందంగా మెరుస్తూండగా లోపలికి అడుగు పెట్టింది శ్రుతి. సోఫాలో పడుకున్న రేఖ కళ్ళచుట్టూ నల్లటి వలయాలు. పసిమిరంగు శరీరం వన్నె తరిగినట్లుగా వుంది. చురుగ్గా, ఉత్సాహంగా వుండే చూపులు నిర్లిప్తంగా, స్థబ్దంగా వున్నాయి.

"సారీ మేడమ్! మీ కసలే తీరికుండదని తెలిసీ అక్కడిదాకా రాలేక ఇంటికి రప్పించాను. పైకిలేస్తే కళ్ళు తిరుగుతున్నాయి.'

"ఫరవాలేదు" రేఖ పల్స్ గమనిస్తూ అంది శ్రుతి.

"తీవ్రమైన అలసట, నీరసం తప్ప మరేం కనిపించడం లేదు - ఎనీ వే, రేపోసారి హాస్పిటల్‌కి రా. బ్లడ్, యూరిన్ - అన్నీ టెస్ట్ చేయిద్దాం" రేఖకు ఇంజక్షన్ చేస్తూ చెప్పింది శ్రుతి.

"అలాగే మేడమ్, అప్పుడే ఇరవై రోజులనుంచి మీ దగ్గరకు రావాలని ప్రయత్నం. కాని తీరడం లేదు."

షోకేస్‌లో అందంగా అమర్చివున్న రకరకాల బొమ్మల్ని, ఆర్ట్ పీసెస్‌ని ప్రశంసగా చూస్తూంది శ్రుతి. మంచి గృహిణిగా, సమర్థురాలైన లెక్చరర్‌గా బిజీగా వుంటూ కూడా యివన్నీ తయారుచేసి, కళాత్మకంగా అమర్చే అభిరుచిని నిలుపుకోవడం సంతోషం కలిగించింది.

"అబ్బ! ఎంత ఓపిక నీకు?! ఇవన్నీ నువ్వు చేసినవే కదూ?!"

"నేను చేసినవే. గత వైభవపు చిహ్నాలు. స్టూడెంట్‌గా వున్నప్పుడూ, పెళ్ళయిన కొత్తలోనూ చేసినవి" నిట్టూర్చింది రేఖ.

అంతలో రేఖ కూతురు మనోజ్ఞ స్నానం చేసి, టవల్ చుట్టుకుని వచ్చి రేఖను బట్టలు తీసివ్వమని అడిగింది. రేఖ బలవంతాన లేచి వెళ్ళి బట్టలు తీసిచ్చింది. తిరిగొస్తూ తూలిపడి పోబోయిన రేఖను చటుక్కున లేచి చెయ్యి ఆసరా యిచ్చి సోఫాలో పడుకోబెట్టింది శ్రుతి.

"వాట్ హాపెండ్ మమ్మీ!" క్రికెట్ బాట్ పుచ్చుకుని పరుగెత్తుకుని వచ్చిన సందీప్ తల్లి దగ్గర ఓ క్షణం ఆగి ఛెస్‌బోర్డ్ తీసి, మేనత్త కొడుకు సారధితో ఆడసాగాడు.

"మనోజ్ఞా! అమ్మకు కొంచెం మంచినీళ్ళు తీసుకురామ్మా!" ఫ్రాక్ హుక్స్ కూడా పెట్టుకోకుండా సోఫాలో చేరగిలబడి కామిక్స్ చదువుకుంటున్న పదేళ్ళ మనోజ్ఞ, పన్నెండేళ్ళ సందీప్, దాదాపు అంతే వయసున్న సారధి, ముగ్గురూ శ్రుతి చెప్పింది విన్నారు. రెండు నిమిషాలు గడిచినా ఎవరూ లేచే ప్రయత్నం చెయ్యకపోవడంతో నర్స్‌తో తెప్పించింది శ్రుతి.

"ఏమిటి మేడమ్, అంత షాకయ్యారు - మా చిరంజీవుల్ని చూసా?" విచారంగా నవ్వింది రేఖ. మౌనంగా చూస్తోంది శ్రుతి. మనోజ్ఞ పుస్తకం సోఫాలో విసిరేసి బయటకు పరుగెత్తింది. సందీప్, సారధి ప్రపంచం తల్లక్రిందులయినా తెలియనంతటి సీరియస్‌నెస్‌తో ఆటలో నిమగ్నులయారు.

"మేడమ్! నా అనారోగ్యానికి కారణం వీళ్ళే." శ్రుతి ఆశ్చర్యం రెట్టింపయింది.

"ఫన్నీ! పిల్లలు నీ అనారోగ్యానికి కారణమా?"

"మేడమ్! నేను చెప్పేది వింటే మీకు సిల్లీగా కనిపిస్తుందేమో కూడా! నేను, ప్రసాద్ ఏం చెయ్యాలో తోచక సతమతమయిపోతున్నా" తనూ, ప్రసాద్ ఒకరి కోసం ఒకరు తపించిపోవడం, ఇద్దరికీ ఉద్యోగాలు దొరికి పెళ్ళితో తమ అనుబంధాన్ని మరీ సన్నిహితం చేసుకోవడం, కమ్మని కబుర్లతో, కలిసి పనిచేసుకోవడంతో, చిలిపి అల్లర్లతో రోజులు నిమిషాల్లా దొర్లిపోవడం, సాయం సమయాల్లో స్కూటర్‌మీద ప్రసాద్ వెనుక కూర్చుని పలకరిస్తున్న చల్లగాలిని కుశలమడుగుతూ రివ్వున దూసుకుపోవడం - పెళ్ళయిన రెండేళ్ళకు తన ఒడిలో సందీప్, మరో రెండేళ్ళలో మనోజ్ఞ. ఎంత థ్రిల్లింగ్‌గా, ఎంత సంతోషంగా గడిచిపోయేవి రోజులు!

"మా మామగారు పోయి ఆరేళ్ళయింది. అప్పటినుంచి అత్తగారు మా దగ్గరే వుంటున్నారు. ఆవిడ వచ్చిన దగ్గర్నుంచి మా రొటీన్ మారిపోయింది... మా ఆడబడుచు- పల్లెటూళ్ళో సరిగ్గా చదువబ్బడం లేదని సారధిని యిక్కడకు పంపింది. ముగ్గురు పిల్లలు, ఇంటెడు పని, కాలేజి... నేను సంతోషంగా వుంటే బహుశా యివన్నీ చురుగ్గా చక్కబెట్టుకునే దాన్నేమో!" రేఖ మాటలు వింటూ శ్రుతి ఆలోచిస్తోంది. ఏమిటి అమ్మాయి సమస్య? ప్రసాద్ సరిగ్గా చూసుకోవడం లేదా?!

"మా అత్తగారికి వీరమడి. అంచేత పని మనుషుల్తో చేయించుకునే ప్రశ్నేలేదు. పెద్ద పనుల్ని పిల్లల కెలాగూ అప్పజెప్పం కదా! చిన్నచిన్న పనులు, కనీసం వాళ్ళ పనులు వాళ్ళు చేసుకోకపోతే ఎలా చెప్పండి? ఇందాక చూశారుగా మీరు? స్నానంచేసి బట్టలు కూడా తీసుకోదు మనోజ్ఞ. వాడూ అంతే. ప్రతిదీ నేను అమర్చిపెట్టాలి. బూట్లు పాలీష్ చెయ్యడం దగ్గర్నుంచి హోమ్‌వర్క్‌దాకా నేనే చూడాలి. యిదంతా మా అత్తగారి గారాబం ఫలితం. వాళ్ళకేదైనా పనిచెప్తే

చాలు - చిన్నపిల్లలు వాళ్ళెందుకు పనులు చేసి కందిపోవాలని వాళ్ళను వెనకేసుకొస్తూ మాట్లాడుతుంది...'' తన హృదయంలోని బాధను విని, అర్థం చేసుకోగల శ్రోత దొరికిందే చాలనుకుని చెప్తూంది రేఖ.

"ప్రసాద్ హెల్ప్ చెయ్యరా!"

"ప్రసాద్ ఆవిడ రాకముందు నా వెంట వెంట వుండి అన్నిటికీ హెల్ప్ చేసేవాడు. ఇద్దరం కలిసి చేసుకుంటూంటే పని చేస్తున్నట్లనిపించేదే కాదు. ఇప్పుడు ప్రసాద్ వంటింటి ఛాయలకు వచ్చాడంటే చాలు, చెట్టంత మగాడు ఆడంగి పనులు చేయడమేమిటంటూ మూడో ప్రపంచ యుద్ధం వచ్చినంత హడావిడి చేస్తుందావిడ."

"బావుంది. కనీసం ఆవిడయినా చేస్తుందా పని?'' రేఖ ముందే, తన అత్తగారు ఊరికెళ్ళిందని చెప్పడంవల్ల ధైర్యంగా అడిగింది శ్రుతి.

"ఆవిడ చెయ్యడం ప్రసాద్‌కి యిష్టం ఉండదు. యింక గొడవెందుకని నేనేచేసు కుంటాను. అసలు పనులు చేసుకోవడం కాదు నాప్రాబ్లమ్... పిల్లలు ఏపనీ రాకుండా, ఏ పనీ చేసే అలవాటు లేక, సోమర్లుగా, అసమర్థులుగా వుండిపోతారేమోనని నా భయం... తల్లిగా నా పిల్లలమీద నేను పెట్టుకున్న ఆశలు వేరు, వ్యక్తిగా నేను కోరుకున్న జీవితం వేరు. నా పిల్లలు యిటు పనిలోనూ, అటు చదువులోనూ, ఇతర కార్యక్రమాల్లోనూ నంబర్ వన్‌గా ఉండాలి. చురుగ్గా, బలంగా, కొండల్నైనా పిండిచేస్తాం అన్నంత ధీమాగా వుండాలి... నా భర్త, నేను సన్నిహితంగా కబుర్లు చెప్పుకుంటూ పనులు చేసుకోవడం నాకానందాన్ని కలిగిస్తుంది. నాకంటూ కొంత టైమ్‌ని మిగుల్చుకుని, కొత్తరకం బొమ్మలు చేయడం, ఎంబ్రాయిడరీ చెయ్యడం, నచ్చిన పుస్తకాలు చదవడం... ఇంకా ఈ అందమైన కలకలగానే మిగిలిపోతుందా అన్న నిస్పృహ... నా పరిధి కేవలం ఈ చిన్ని కుటుంబం మాత్రమే కాదు, లెక్చరర్‌గా నాకో పవిత్రమైన బాధ్యతుంది. అనుక్షణం అభివృద్ధి చెందుతున్న సైన్సుని ఎప్పటికప్పుడు తెలుసుకుని, క్లాసులో చెప్పవలసిన నేను, ఆ అవకాశం లేక యాంత్రికంగా మొక్కుబడి తీర్చుకుంటున్నట్లుగా చెప్పేయడం - నా వృత్తికి ద్రోహం చేస్తున్నట్లుగా, నా బాధ్యతను నిర్వర్తించడంలో నేను ఫెయిలవు తున్నట్లుగా... అసంతృప్తి. ఈ స్థితిని మార్చాలన్న తపన, నేను కోరుకున్న జీవితాన్ని సాధించాలన్న తహతహ, అత్తగారికి గట్టిగా చెప్పలేని అసమర్థత, దారి తప్పుతున్న పిల్లల్ని మార్చలేని అసహాయత, ఈ సంఘర్షణవల్ల ప్రసాద్‌కీ, నాకూ మధ్య పలుచని తెర జారుతుందేమో నన్న భయం...'' చెప్పుకుపోతూంది రేఖ.